సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం ı 10 ı జనవరి ı 2023



మకర తోరణం సమర్పణ

కొత్తపేట: కమ్మిరెడ్డిపాలెం గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారికి పరమటి సుబ్బారావు, సుజాత దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ. 80 వేలతో ఇత్తడి మకర తోరణాన్ని సమర్పించారు.



కోనసీమ కుర్రోడి పంచ్‌కొట్టుడు

కోనసీమ జిల్లా ప్రాంతంలో ఓ కుగ్రామం కుందాలపల్లికి చెందిన పృథ్వీరాజు కుర్రోడు బాక్సింగ్‌లో రాణిస్తున్నాడు. - వివరాలు 8లో▸

క్రీడలతో ఉజ్వల భవిత



చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. - 8లో▸

న్యూస్‌రీల్

12న మినీ జాబ్ మేళా

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యాన ఈ నెల 12న రాజమహేంద్రవరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.హరీష్ చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.ప్రశాంత్, జేడీఎం సుమలత సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో ఈ విషయం తెలిపారు. వాల్‌మార్ట్, డి-మార్ట్, పేటీఎం కంపెనీల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. టెన్త్, ఇంటర్, ఆపై చదివి, 19 నుంచి 29 సంవత్సరాల వయస్సు వారు అర్హులని వివరించారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ వేతనం ఇస్తారన్నారు. ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాలతో https://tinyurl.com/egmjbsee23 వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయ్యి, మినీ జాబ్ మేళాకు రెజ్యూమ్, ఆధార్, పాన్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో ఆ రోజు ఉదయం 9 గంటలకు తాడితోట సమీపంలోని జిల్లా ఉపాధి కార్యాలయానికి రావాలని సూచించారు. వివరాలకు 96664 72877 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పోలీసు స్పందనకు 30 ఫిర్యాదులు



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ రజని

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ (శాంతిభద్రతలు) ఎం.రజని సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 30 ఫిర్యాదులు వచ్చాయి. వారితో అడిషనల్ ఎస్పీ నేరుగా మాట్లాడారు. సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

ఉత్తమ వైద్యులకు సత్కారం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలోని ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ మేరకు ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ద్వారా జిల్లాలో ప్రజారోగ్య భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టామని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. ఉత్తమ సేవలు అందించిన వైద్యులను కలెక్టరేట్ స్పందన హాలులో సోమవారం ఆమె సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో వైద్యులు రవిచంద్ర (కోరుకొండ పీహెచ్‌సీ), రాజు (సీతానగరం), సౌజన్య, అవినాష్ (కలవలపల్లి), ఈషా జ్యోతి (దోసకాయలపల్లి) వారికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేశారని అన్నారు. ఈ నేపథ్యంలో వారిని సత్కరించామని తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలుశిక్ష

నిడదవోలు: చెక్‌బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ స్థానిక ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.కృష్ణప్రసాద్ సోమవారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన మొక్కరాల వెంకటేశ్వరరావు వద్ద అత్తిలి శ్రీను అనే వ్యక్తి 2018లో రూ.2.90 లక్షల అప్పు తీసుకున్నాడు. ఆ సమయంలో ఒక చెక్కు, ప్రామిసరీ నోటు ఇచ్చాడు. చెక్ బౌన్స్ అవడంతో వెంకటేశ్వరరావు కోర్టులో కేసు వేశారు. విచారణ అనంతరం కేసు రుజువు కావడంతో అత్తిలి శ్రీనుకు ఏడాది జైలు శిక్ష విధించారు. ఫిర్యాదీకి ఇవ్వాల్సిన నగదును మూడు నెలల్లో ఇవ్వకుంటే మరో మూడు నెలల జైలుశిక్ష అనుభవించాలని పేర్కొన్నారు.

ఉగాది నాటికి 6,196 ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో నిర్దేశించిన 6,196 గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో ఆమె సోమవారం సమీక్షించారు. హౌసింగ్, వ్యవసాయం, కోడిపందేల నియంత్రణ, రీసర్వే, స్పందన, ఎస్‌టీజీ లక్ష్యాలు, ఈ-కేవైసీ, వైఎస్సార్ చేయూత తదితర అంశాలపై ఆమె మాట్లాడారు. ఉగాది నాటికి జిల్లాలో 6,196 ఇళ్లు పూర్తి చేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇచ్చే రూ.35 వేల అదనపు రుణాలను 30,214 మందికి గాను ఇప్పటి వరకూ 19,644 మందికి మంజూరు చేశామని వివరించారు. జిల్లాలో ఈ-పంట నమోదు ఈ-కేవైసీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. జగనన్న పాలవెల్లువ లబ్ధిదారులను ఎంపిక పూర్తి చేయాలన్నారు. సంక్రాంతి నేపథ్యంలో కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

పొత్తు పొడిస్తే.. సీటు సితారే..



- టీడీపీలో ఇప్పటికే తారస్థాయిలో విభేదాలు
- మరింత అగ్గి రాజేసిన పవన్, చంద్రబాబు భేటీ
- ఉమ్మడి పోరు ప్రకటనపై 'పచ్చ' శ్రేణుల్లో అసంతృప్తి
- జనసేనతో జత కడితే కుర్చీలాట తప్పదేమోనని ఆందోళన

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీలో ఇప్పటికే వర్గ విభేదాలు తారస్థాయిలో ఉన్నాయి. ఒక్కో నియోజకవర్గంలో రెండు మూడు వర్గాలుగా విడిపోయి మరీ ఆ పార్టీ నాయకులు కయ్యాలకు కాలు దువ్వుతున్నారు. సరిగ్గా ఇదే తరుణంలో టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీ కావడం వారికి 'పుండు మీద కారం చల్లిన' చందంగా మారింది. దీనికి తోడు ఉమ్మడిగానే పోరు కొనసాగిస్తామని, పొత్తులపై తర్వాత చర్చిస్తామని ప్రకటించడం ఆ పార్టీ శ్రేణుల్లో చర్చకు తెర లేపింది.

ఈ పరిణామం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన పొత్తు అనివార్యమన్న సంకేతాల నివ్వడంతో.. ఇప్పటికే టీడీపీ టిక్కెట్లు ఆశిస్తున్న వారిలో అంతర్మథనం మొదలైంది. పొత్తు పొడిస్తే తమ కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ పొత్తుకు అడుగులు పడితే ఎలాగని టీడీపీ నేతలు, కార్యకర్తలు మల్లగుల్లాలు పడుతున్నారు.

బుచ్చయ్యకు పొత్తు సెగ

టీడీపీతో పొత్తు కుదిరితే రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం నియోజకవర్గాలను జనసేన కోరే అవకాశం ఉందని చెబుతున్నారు. జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నారు. తనకు పవన్ కల్యాణ్ ఆశీస్సులు పుష్కలంగా ఉన్నాయని, ఆరు నూరైనా రూరల్ స్థానం తనకే దక్కుతుందని ఆయన ధీమాగా ఉన్నారు. టీడీపీ, జనసేన పొత్తులు ఎన్నికల సమయంలో వచ్చే అంశమని, ఈలోగా ప్రభుత్వ విధానాలపై ఉమ్మడిగా పోరాటం చేస్తామని సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన చెప్పారు. ఇది అంతర్గతంగా పొత్తు ఖాయమన్న భావనను వ్యక్తపరుస్తోందని పలువురు చెబుతున్నారు.

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో జనసేన అభ్యర్థనకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వక తప్పని స్థితి టీడీపీది. ఒకవేళ రూరల్ సీటును జనసేనకు కేటాయిస్తే టీడీపీ సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి భంగపాటు తప్పదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇదే జరిగితే రూరల్‌లో బుచ్చయ్య వర్గం కందుల దుర్గేష్‌కు మద్దతు ఇస్తుందా? టీడీపీ జెండాలు మోసి, జనసేనతో కయ్యానికి కాలు దువ్విన నేతలు ఒకే వేదికపై పని చేసేందుకు అంగీకరిస్తారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

సిటీ ఇచ్చినా తలనొప్పే..

ఒకవేళ సీనియర్‌ను పక్కన పెట్టడం తగదని టీడీపీ అధిష్ఠానం భావించి, రాజమహేంద్రవరం సిటీ నుంచి బరిలో దింపాలని నిర్ణయిస్తే బుచ్చయ్యకు మరో తలనొప్పి ఎదురవుతుంది. ఇక్కడ ఇప్పటికే ఆదిరెడ్డి భవాని టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. బుచ్చయ్యకు ఇక్కడ ఇస్తే ఆమె స్థానం గల్లంతవడం ఖాయం. అప్పుడు ఆయన మామ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు వర్గానికి భంగపాటు తప్పని పరిస్థితి. సిటీ స్థానం తమకే దక్కుతుందని, దీనిపై ఇదివరకే చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారని ఆదిరెడ్డి వర్గం ఇప్పటికే ప్రచారం చేస్తోంది. ఒకవేళ సిటీ సీటు గోరంట్లకు కేటాయిస్తే ఆదిరెడ్డి వర్గం తీవ్రంగా వ్యతిరేకించే సూచనలు కనిపిస్తున్నాయి. సిటీ గోరంట్లకు కేటాయిస్తే ఆదిరెడ్డి వర్గానికి ఎంపీ టికెట్ ఇచ్చే చాన్స్ ఉందని విశ్లేషకులు అంటున్నారు. అందుకు వాళ్లు సుముఖత వ్యక్తం చేస్తారా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఏది ఏమైనా చంద్రబాబు నిర్ణయం పార్టీ శ్రేణుల్లో గందరగోళానికి దారి తీస్తోంది. పవన్, బాబు భేటీని జాగ్రత్తగా పరిశీలిస్తున్న నేతలు అవసరమైనప్పుడు స్పందించేందుకు వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారు.

రాజానగరంలో టీడీపీ దుకాణం బంద్

మరోపక్క తమకు తప్పనిసరిగా దక్కుతుందని జనసేన భావిస్తున్న రాజానగరం స్థానంలో కూడా రాజకీయం వేడెక్కింది. ఇక్కడ టీడీపీకి మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ పెద్ద దిక్కుగా ఉన్నారు. చంద్రబాబు వ్యవహార శైలితో విసుగు చెందిన ఆయన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి ఇటీవల గుడ్‌బై చెప్పారు. బలమైన అభ్యర్థి లేకపోవడంతో రాజానగరం నియోజకవర్గంలో టీడీపీ దుకాణం బందైంది. జనసేన నుంచి బత్తుల బలరామకృష్ణ ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నారు. టీడీపీ అభ్యర్థి పోటీగా లేకపోవడంతో ఇక్కడ తనకు లైన్ క్లియరైనట్టేనని ఆయన నమ్ముతున్నారు. ఒకవేళ రాజానగరాన్ని జనసేనకు కేటాయిస్తే మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వర్గం మద్దతిచ్చే సూచనలు కనిపించడం లేదు. వర్గ విభేదాలు భగ్గుమనే అవకాశాలున్నాయి. ఇదే జరిగితే జనసేన ఆశలు గోదారిలో కలిసినట్టేనన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల అందజేత



కిరణ్‌కుమార్‌కు ల్యాప్‌టాప్ అందిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రతి ఒక్కరూ ఉన్నత చదువు చదివి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే ఆకాంక్షతో రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో రూ.70 వేల విలువైన రెండు ల్యాప్‌టాప్‌లను ఇద్దరు విద్యార్థులకు అందజేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడుకు చెందిన జుత్తిగ సుబ్రహ్మణ్యం (అంధత్వం), సీతానగరం మండలం జల్లిమూడికి చెందిన సిద్దా కిరణ్ కుమార్(చెవిటి, మూగ)లకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. విద్యార్థి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, దరఖాస్తు చేసిన నాలుగు నెలల్లోనే ప్రభుత్వం ల్యాప్‌టాప్ అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.కామరాజు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: ఇంటర్‌లో ప్రవేశానికి ఎటువంటి స్కాలర్‌షిప్, టాలెంట్ పరీక్షలు నిర్వహించడానికి జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థలకు అనుమతి లేదని ఇంటర్మీడియెట్ విద్యా మండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా ఈ విషయం గమనించాలన్నారు.

కార్మికులకు అన్యాయం జరగనివ్వం

- వారి ప్రయోజనాలకే ప్రాధాన్యం
- గత ఒప్పంద హామీలన్నీ అమలుచేయాలి
- పేపరుమిల్లు ముందు బైఠాయించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



రాత్రయినా పేపరుమిల్లు వద్దే దీక్ష కొనసాగిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): కార్మికుల ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తూ పేపరుమిల్లు పరిరక్షణకు అనుగుణంగా పోరాటం సాగిస్తామని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రాజమహేంద్రవరంలోని ఏపీ పేపరు మిల్లు కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై పోరాటంలో భాగంగా సోమవారం మధ్యాహ్నం నుంచి ఆయన వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మిల్లు గేటు ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను గౌరవించకుండా, కార్మిక నాయకుల సొంత ప్రయోజనాల కోసం జరుగుతున్న అక్రమ వ్యవహారాలను కలెక్టర్, కార్మిక శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అయినా ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి యాజమాన్యాన్ని నిలదీయడానికి వచ్చామన్నారు. ఒక ప్రజా ప్రతినిధిగా తాను వచ్చినా మూడు గంటలుగా గేట్లు మూసివేసి, కనీసం మాట్లాడే ప్రయత్నం కూడా యాజమాన్యం చేయకపోవడాన్ని నిరసిస్తూ గేటు ముందు బైఠాయించామన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన

జక్కంపూడి రాజా మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. అంతమాత్రాన కార్మికుల ప్రయోజనాలను తాకట్టు పెడితే ఆయన అంగీకరించరన్నారు.



పంప్ హౌస్‌పైకి ఎక్కి యువకుల ఆందోళన



పేపరుమిల్లు వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, శివరామసుబ్రహ్మణ్యం తదితరులు

20, 30 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికుల ప్రయోజనాలను తాకట్టుపెట్టి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జయకృష్ణ, గుర్తింపు పొందిన కార్మిక సంఘ నేత కలిసి సొంత ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఇదే పేపరు మిల్లు సమస్యలపై నిరాహార దీక్ష చేసిన సమయంలో పలు అంశాలతో యాజమాన్యం, కార్మికుల మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. అయితే నేటికి ఆ ఒప్పందంలోని అంశాలు నెరవేరలేదన్నారు. మిల్లులో పనిచేస్తున్న సీనియర్ కార్మికులను బలవంతంగా వీఆర్ఎస్ పేరిట బయటకు పంపించి, వారి స్థానంలో నైపుణ్యం లేని కొత్త యువకులను నియమించుకుంటున్నారన్నారు. యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మికులను పోరాటానికి సిద్ధం చేస్తామని, మిల్లును నిలిపివేస్తామని రాజా ప్రకటించారు. కేవలం కార్మికుల ప్రయోజనాలు ముడిపడివున్నందునే రాజమహేంద్రవరం ప్రజలు పేపరు మిల్లు కాలుష్యాన్ని భరిస్తున్నారన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే సహించేదిలేదని రాజా హెచ్చరించారు.

పంపు హౌస్ వద్ద ధర్నా

పేపరు మిల్లు పంపు హౌస్ వద్ద ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. పంపుహౌస్ పైకి కొందరు యువకులు ఎక్కి యాజమాన్యం దిగి రావాలని నినాదాలు చేశారు. ఈ క్రమంలోనే పోలీసులు రంగప్రవేశం చేసి వారిని కిందికి దింపి, అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ధర్నాలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకుడు శివరామ సుబ్రహ్మణ్యంతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నందెపు శ్రీనివాస్, పోలు విజయలక్ష్మి, బొంత శ్రీహరి, మాసా రామ్‌జోగ్, ఉప్పాడ కోటరెడ్డి, ఇసుకపల్లి శ్రీనివాస్, పుష్పరాజ్, నరవ గోపాలకృష్ణ, కాటం రజనీకాంత్, సోము, కోడి కోట, సీపీఐ నాయకులు అరుణ్, పవన్ పాల్గొన్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్..

మంగళవారం నుంచి ఉద్యమం మరింత ఉధృతం

పేపరు మిల్లు కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త, పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి, మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణు, కలెక్టర్ మాధవీలత దృష్టికి తీసుకెళ్లానని రాజా తెలిపారు. యాజమాన్యంతో చర్చలు జరిపి, సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుందామని వారు చేసిన సూచనల మేరకు ఈ రోజుకు ఉద్యమం ముగిస్తున్నామని, మంగళవారం నుంచి మరింత ఉధృత ఉద్యమానికి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. తమ ఉద్యమ సమయంలో పోలీసుల ఓవర్ యాక్షన్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ప్రకటించారు. మరోవైపు రాజమండ్రి 3 టౌన్ పోలీస్ స్టేషన్ పోలీసుల అదుపులో ఉన్న ఏపీఐఐసీ మాజీ చైర్మన్, వైసీపీ నాయకుడు శివరామ సుబ్రహ్మణ్యంను రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన వెంట తీసుకువెళ్లారు.

ఉద్యమం మరింత ఉధృతం

జయకృష్ణ అనే చీటర్ మిల్లును నడిపిస్తున్నారని, కొంతమంది కార్మిక నాయకులుగా చలామణి అవుతున్న యాజమాన్య తొత్తులు రూ.25 లక్షలకు పోస్టులు అమ్ముకుంటున్నారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆరోపించారు. ఉద్యోగాలు పీకేస్తానంటూ బెదిరిస్తున్నారని, వీటికి భయపడేది లేదని, ఉద్యమం ఇంకా ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. మిల్లులో మూడేళ్లుగా కార్మిక సంఘ ఎన్నికలు, వేతన ఒప్పందం జరగలేదని దీనివలన మూడేళ్లుగా ఒక్కో కార్మికుడు రూ.5 లక్షల మేర నష్టపోయారు. మిల్లులో 700 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. సీనియారిటీ ఆధారంగా కార్మికులను రెగ్యులర్ చేయాలని, మహిళలను కూడా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం కార్యాచరణ రూపొందించుకుని 15 రోజుల్లో యాజమాన్యం మెడలు వంచుతామని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి ఆందోళన చేస్తున్నా ఇప్పటి వరకూ మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదంటే యాజమాన్య కార్మిక వ్యతిరేక వైఖరేమిటో స్పష్టమవుతోందన్నారు. దీనికి పేపరు మిల్లు యాజమాన్యం తగిన మూల్యం చెల్లించుకునే పరిస్థితి వస్తుందని రాజా హెచ్చరించారు.

స్పందన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

- కలెక్టర్ మాధవీలత
- 250 అర్జీల స్వీకరణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్పందనలో వస్తున్న అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ప్రజల నుంచి 250 అర్జీలు స్వీకరించారు. మండల స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రీ ఓపెన్ అర్జీలు ఎగువ స్థాయి అధికారులకు వస్తాయని, సమాధానం ఒకటే అయినప్పటికీ పూర్తి స్థాయిలో పరిశీలించి, ఆన్‌లైన్‌లో నివేదిక అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్రస్థాయిలో సమీక్షిస్తున్నందున, శాఖల వారీగా ప్రభుత్వ ప్రాధాన్య అంశాల అమలుపై ప్రగతి నివేదికలు ముందుగానే అందించేందుకు సమాయత్తం కావాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ వారం విద్య, వైద్య, ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం, పంచాయితీరాజ్ శాఖలపై సమీక్ష ఉంటుందని, అందుకు సంబంధించిన పూర్తిస్థాయి ప్రగతి నివేదికలు ముందుగానే సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 554 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 14 తిరిగి వచ్చాయని చెప్పారు. 48 గంటల్లోగా పరిష్కరించాల్సినవి 11, ఇరవై నాలుగు గంటల్లో పరిష్కరించాల్సినవి 6, ఐదు రోజుల్లో పరిష్కరించాల్సినవి 16 ఉన్నాయని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.నరసింహులు, డీఎంహెచ్‌ఓ కె.వెంకటేశ్వరరావు, టీబీ, ఎయిడ్స్ కంట్రోలింగ్ అధికారి ఎన్.వసుంధర తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్

- రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడుకు చెందిన దివ్యాంగుడు కొప్పిశెట్టి వెంకటరమణ బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్ ఇప్పించాలని కోరారు. ఆయనకు వెంటనే ట్రైసైకిల్ మంజూరు చేయాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.
- గత ఆగస్టులో మెడికల్ అన్‌ఫిట్ అయిన తనకు రికార్డు ట్రేసర్‌గా పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చారని, ఇంతవరకూ పోస్టింగ్ ఇవ్వలేదని నగరానికి చెందిన వెలసిల రమేష్‌బాబు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ఆ పాదయాత్ర.. కోట్లాది మందికి వెలుగుబాట

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- జగన్ ప్రజాసంకల్ప యాత్రకు నాలుగేళ్లయిన సందర్భంగా వేడుకలు



ప్రజాసంకల్ప యాత్ర నాలుగేళ్ల వేడుకలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు విపక్ష నేతగా నిర్వహించిన ప్రజాసంకల్ప పాదయాత్ర ఎన్నో కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురింపజేసి, కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఆయన కార్యాలయంలో పార్టీ శ్రేణులు సోమవారం భారీ ఎత్తున వేడుక చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ భరత్ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సీఎం జగన్ ఒక శక్తి అని అన్నారు. ప్రజల కోసం ఆయన రాష్ట్రంలో ఏకంగా 3,648 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేయడం ఒక రికార్డు అని, ఆ యాత్రే రాష్ట్ర ప్రగతిని, అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాన్ని సరికొత్తగా మార్చిందని చెప్పారు. పేదల బతుకులు, వారి వెతలను పాదయాత్రలో దగ్గరగా చూసినందువల్లనే నవరత్నాలు, మరెన్నో సంక్షేమ పథకాలు, వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుకు సీఎం జగన్ నాంది పలికారని ఎంపీ భరత్ గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు వందల వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్టు ప్రకటించడమే తప్ప.. అవి క్షేత్రస్థాయిలో సామాన్యులకు అందని విషయాన్ని జగన్ గ్రహించారని, సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుకు అందాలన్న లక్ష్యంతోనే వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేశారని చెప్పారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సంతృప్త స్థాయిలో అందేలా శ్రద్ధ తీసుకున్నందువల్లనే నేడు ప్రతి కుటుంబం సంతోషంగా ఉంటోందని అన్నారు. గత చంద్రబాబు పాలనలో మాదిరిగా దళారులు, రాజకీయ నేతల ప్రమేయం లేకుండా, ఎవ్వరికీ ఒక్క పైసా లంచం ఇవ్వకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందన్నారు. దీనంతటికీ ప్రజాసంకల్ప పాదయాత్రలో జగన్ పరిశీలన, అధ్యయనమే కారణమని చెప్పారు. ఈ పాదయాత్ర సరికొత్త సువర్ణాధ్యాయానికి, మరో స్వర్ణయుగానికి నాంది పలికిందని, రామరాజ్యాన్ని ప్రజలు చూసే అవకాశం కలిగిందని ఎంపీ భరత్ అన్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ ఆరిఫ్, రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్ చైర్‌పర్సన్ పిల్లి నిర్మల, వైఎస్సార్ సీపీ నేతలు పాలిక శ్రీను, మార్తి లక్ష్మి, పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, ఎన్వీ శ్రీనివాస్, మార్గాని సురేష్, మజ్జి నూకరత్నం, బాపన సుధారాణి, పెంకే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అందాల పోటీల్లో కేశనపల్లి గిత్తకు ప్రథమ స్థానం


ప్రథమ బహుమతి పొందిన పుంగనూరు గిత్తతో అడబాల నాని

మలికిపురం: రాష్ట్ర స్థాయిలో జరిగిన అందాల పోటీలలో మలికిపురం మండలం కేశనపల్లి గ్రామం అడబాల లక్ష్మీనారాయణ (నాని)కి చెందిన పుంగనూరు గిత్త ప్రథమ స్థానం పొందింది. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా పెదతాడేపల్లిలో జరిగిన ఈ పోటీలలో ఈ గిత్తకు రూ.30 వేల బహుమతి లభించింది. మంత్రి కొట్టు సత్యనారాయణ, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు చేతుల మీదుగా లక్ష్మీనారాయణ బహుమతి అందుకున్నారు. దేశీయ గోజాతి సంవర్ధక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

కోనసీమ కుర్రోడి పంచ్‌కొట్టుడు

- బాక్సింగ్‌లో రాణిస్తున్న పృథ్వీరాజు
- రింగ్‌లో 11వ ఏటే ప్రవేశం
- సీఎం కప్ నేషనల్స్‌లో గోల్డ్‌మెడల్ సాధన


విశాఖపట్నంలో నేషనల్ విజేతగా పృథ్వీరాజును ప్రకటిస్తున్న అంపైర్ (ఫైల్)

కొత్తపేట: కోనసీమ ప్రాంతంలో ఓ కుగ్రామం కుందాలపల్లికి చెందిన పృథ్వీరాజు అనే కుర్రోడు బాక్సింగ్‌లో రాణిస్తున్నాడు. ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే బాక్సింగ్ క్రీడపై ఆసక్తి పెంచుకున్న పృథ్వీరాజు ఆ క్రీడలో సాధనచేసి తన 11వ ఏట 6వ తరగతి చదువుతున్నప్పుడే స్కూల్ గేమ్స్ ద్వారా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. అలా ఆ క్రీడలో అంచెలంచెలుగా రాణిస్తూ ఇటీవల నేషనల్స్‌లో తమిళనాడుపై గెలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. పి.గన్నవరం మండలం కుందాలపల్లికి చెందిన చింతా వెంకన్న (కౌలురైతు) – గంగాభవాని (ఆశ వర్కర్) దంపతుల కుమారుడు పృథ్వీరాజు ప్రస్తుతం కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రాథమిక విద్య కుందాలపల్లి, 6 నుంచి 8 వరకూ మామిడికుదురు సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ద్వారా అక్కడ చదవగా, 9, 10 తరగతులు అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్మీడియెట్ కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివాడు.

వివిధ స్థాయిల్లో విన్నర్‌గా..: 2013లో 6 వ తరగతి చదువుతుండగా పృథ్వీరాజుకు బాక్సింగ్ క్రీడపై ఆసక్తి ఏర్పడింది. కోచ్ బొంతు మధుకుమార్ వద్ద శిక్షణ పొందాడు. అదే సంవత్సం స్కూల్ గేమ్స్‌లో పాల్గొని విజేతగా నిలిచాడు. 2014, 2015 సంవత్సరాల్లో కూడా అదే గేమ్స్‌లో విన్నర్‌గా బహుమతులు గెలుచుకున్నారు. 2021 వరకూ వివిధ కారణాలతో పోటీలకు దూరంగా ఉన్న పృథ్వీరాజు డిగ్రీ చదువుతూ అధ్యాపకుల ప్రోత్సాహంతో మళ్లీ పోటీల్లో పాల్గొంటున్నాడు. అదే ఏడాది విశాఖపట్నం జిల్లా అంకంపల్లిలో జరిగిన 14వ జాతీయ స్థాయి పోటీల్లో, గత ఏడాది నవంబర్‌లో విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో, డిసెంబర్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్థాయిలో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్‌లో పాల్గొని విన్నర్‌గా నిలిచాడు. తాజాగా గత నెల 21న విశాఖపట్నం ఆర్‌కే బీచ్‌లో నిర్వహించిన ఏపీ సీఎం కప్ నేషనల్స్‌లో తమిళనాడుపై విజయం సాధించి గోల్డ్‌మెడల్ దక్కించుకున్నాడు. ప్రస్తుతం విశాఖపట్నంకు చెందిన కోచ్ వాసు వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు.

దేశానికి ఖ్యాతి తేవాలన్నది లక్ష్యం



నేను చదువుతో పాటు ఏదో ఒక క్రీడలో రాణించి పేరు తెచ్చుకోవాలని, తద్వారా మంచి ఉద్యోగం పొందాలని అనుకున్నాను. అందుకు బాక్సింగ్‌ను ఎంచుకున్నాను. అంతర్జాతీయంగా విజేతగా నిలిచి దేశానికి ఖ్యాతి తీసుకురావాలన్నది నా లక్ష్యం. మరింత మందిని బాక్సింగ్ క్రీడాకారులను తయారు చేస్తా.

– చింతా పృథ్వీరాజు, బాక్సింగ్ క్రీడాకారుడు

ప్రోత్సాహం అవసరం



నేషనల్ బాక్సింగ్ విజేతగా నిలిచిన పృథ్వీరాజులో ఇంటర్నేషనల్ స్థాయిలో ఆడాలనే పట్టుదల ఉంది. ఆర్థిక ప్రోత్సాహం లేక తగిన కోచింగ్ తీసుకోవడం లేదు. తగిన ప్రోత్సాహం ఉంటే కోచింగ్ తీసుకుని లక్ష్యాన్ని సాధిస్తాడు.

–కె.కనకరాజు, పీడీ, వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొత్తపేట

నలుగురికి కారుణ్య నియామకాలు


కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబికులకు సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో కలెక్టర్ కృతికా శుక్లా కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. నలుగురికి సీనియారిటీని బట్టి ఖాళీల సంఖ్యను తీసుకుని రోస్టర్ ప్రకారం ట్రెజరీ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ సహాయకులుగా నియమించారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు.

తుప్పల్లో మృత శిశువు


అన్నదేవరపేటలో తుప్పల్లో శిశువు మృతదేహం

తాళ్లపూడి: తుప్పల్లో నెలలు నిండని పసికందు మృతదేహాన్ని పడేయడం అన్నదేవరపేటలో చర్చనీయాంశమైంది. అక్కడి అరుంధతీ పేటలో వాటర్ ట్యాంక్ సమీపంలో నీళ్ల పట్టుకోవడానికి వచ్చిన మహిళలు సుమారు 6 నెలల మృత పసికందును గుర్తించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో శిశువును చూడటానికి వచ్చారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు. ఏఎస్ఐ దాస్, ఆర్ఐ క్రాంతి రేఖ, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యకుమారి, వీఆర్‌వో నాగేశ్వరరావు తదితరులు పరిశీలించారు.

రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపిక


రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నిడదవోలు: స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఇంటర్ కాలేజియేట్ రోప్ స్కిప్పింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 50 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో అత్యంత ప్రతిభ కనబరిచిన 12 మందిని ఎంపిక చేశారు. ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపిక కావడంతో వారిని ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్ర అభినందించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ పి.బాపిరెడ్డి, సెలక్షన్ కమిటీ సభ్యుడిగా శేఖర్‌రాజు, పర్యవేక్షకుడిగా జి.విక్టర్‌బాబు వ్యవహరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ కేఎస్ రత్నకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటలతో మానసిక ఉల్లాసం


బెలూన్లు ఎగురవేసి ఖోఖో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కన్నబాబు, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ క్రీడా మైదానంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే సౌత్‌జోన్ ఖోఖో టోర్నమెంట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులు ఆహ్లాదకర వాతావరణంలో క్రీడలు ఆడాలన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆటల్లో ప్రతిభ చూపి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ ఈ పోటీల్లో 1,200 మంది క్రీడాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని టోర్నమెంట్‌లు జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. క్రీడలకు కాకినాడలో మంచి అనువైన మైదానాలు ఉండటం నగరవాసుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సు మలత, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్, డాక్టర్ జీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల అభివృద్ధికి కృషి


ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ప్రసాదరాజు

రాజానగరం: సహచరుల సహకారంతో మూడు యూనివర్సిటీల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వాటి అభివృద్ధికి కృషి చేస్తానని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. 'నన్నయ' ఇన్‌చార్జి వీసీగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈసీ హాలులో నిర్వహించిన సమావేశంలో బోధన, బోధనేతర సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. జేఎన్‌టీయూకే వీసీగా ఉన్న తనను జేఎన్‌టీయూ విజయనగరంతో పాటు 'నన్నయ' వర్సిటీకి కూడా ఇన్‌చార్జిగా నియమించినందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంగణంలో అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణ పనుల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, త్వరితగతిన పూర్తి చేసే విధంగా ప్రయత్నిస్తానన్నారు. యూనివర్సిటీ అభివృద్ధిలో అంతా భాగస్వాములు కావాలని, తమ విలువైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఆచార్య ప్రసాదరాజు, అరుణ దంపతులకు ఎన్‌సీసీ విద్యార్థులు గార్డ్ ఆఫ్ ఆనర్ ఇవ్వగా, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, అనుబంధ కళాశాలల ప్రతినిధులు, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓఎస్‌డీ ఆచార్య ఎస్.టేకి, ఈసీ మెంబర్లు ఆచార్య కేఎస్ రమేష్, డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, డీన్‌లు పి.సురేష్‌వర్మ, వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్స్, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌ల అధికారులు, పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిత


రిబ్బన్ కట్ చేసి జాతీయ స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి రాజా, దొరబాబు


సభలో మంత్రి, ఎంపీ తదితరులు

- మంత్రి దాడిశెట్టి రాజా, ఎంపీ వంగా గీత, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- శ్రీప్రకాష్‌లో అట్టహాసంగా టేబుల్ టెన్నిస్ పోటీలు

పెద్దాపురం: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను సోమవారం వారు ప్రారంభించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించిన శ్రీప్రకాష్ టీటీ అకాడమీ నుంచి ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలన్నారు. శ్రీప్రకాష్ పాఠశాల జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి పోటీతత్వాన్ని అలవర్చుకుని ముందడుగు వేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు మాట్లాడుతూ క్రీడలకు శ్రీప్రకాష్ యాజమాన్యం ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయమన్నారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రావు చిన్నారావు, కె.మోహన్‌బాబు మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్ క్రీడకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పెట్టింది పేరన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నైపుణ్యాన్ని ప్రదర్శించి విజయం సాధించాలన్నారు. 24 రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది క్రీడాకారులు ఐదు రోజుల పాటు జరిగే టీటీ పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం మంత్రి రాజా, ఎంపీ గీత, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబులు టేబుల్ టెన్నిస్ ఆడి పోటీలను ప్రారంభించారు. రిఫరీలు సూర్యారావు, వేణుగోపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు కనపర్తి చీమదొర, బోనాసు గుర్రాజు, యినకొండ వీరవిష్ణుచక్రం, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

300 కిలోల గంజాయి స్వాధీనం


పట్టుకున్న వ్యాన్, నిందితుడిని చూపుతున్న రావులపాలెం పోలీసులు

రావులపాలెం: ఓ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకుని డ్రైవర్‌ను అరెస్టు చేయడంతో పాటు 300 కిలోల గంజాయి, రూ.2.60 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్ సోమవారం తెలిపారు. ఆదివారం సాయంత్రం గోపాలపురం ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద జాతీయ రహదారిపై వాహన తనిఖీ చేస్తుండగా రావులపాలెం వైపు నుంచి తణుకు వైపు వ్యాన్‌లో తరలిస్తున్న గంజాయిని గుర్తించామన్నారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం వలసంపేటకు చెందిన డ్రైవర్ పోతు శివను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. అక్రమ సంపాదనకు ఆశపడి గంజాయిని రవాణా చేస్తున్నట్టు నిందితుడు అంగీకరించాడన్నారు. కేసు నమోదు చేసి అతనిని రిమాండ్ నిమిత్తం కొత్తపేట జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచామన్నారు. గంజాయిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఎస్సై సురేంద్రను, ఇతర కానిస్టేబుల్స్‌ను సీఐ అభినందించారు.

జిల్లా అగ్నికుల యూత్ అధ్యక్షుడిగా వెంకటరాజు



అమలాపురం టౌన్: జిల్లా అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ అధ్యక్షుడిగా అల్లవరం మండలం ఎస్.పల్లిపాలేనికి చెందిన కొపనాతి వెంకటరాజు నియమితులయ్యారు. ఈ నెల 8న విజయవాడలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో జరిగిన సంఘ పోషకుల ఆత్మీయ సమావేశంలో జిల్లా కమిటీని నియమించారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటరాజుతో పాటు గౌరవాధ్యక్షుడిగా ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన బొడ్డు బుజ్జి, జిల్లా కన్వీనర్‌గా బండార్లంకకు చెందిన కొప్పాడి దుర్గారావు నియమితులయ్యారు. ఈ మేరకు వెంకటరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు నియమితులైన ముగ్గురినీ అమలాపురంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి పినిపే విశ్వరూప్, వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం రాత్రి అభినందించారు.

బంగారు ఆభరణాల చోరీ

సీతానగరం: మిర్తిపాడు గ్రామంలోని ఓ ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ జరిగింది. ఆ గ్రామానికి చెందిన కోరాడ వెంకటలక్ష్మి ఈ నెల 5న తన ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్‌లోని తన కుమారుల వద్దకు వెళ్లింది. సోమవారం ఆమె హైదరాబాద్ నుంచి ఇంటికి రాగా తలుపు తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులోని బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని గుర్తించి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. 30 కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు చెబుతోంది. ఎస్సై కె.శుభశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై విచారణ చేస్తున్నామని ఆయన తెలిపారు.

హత్య కేసులో మరో నిందితుడి అరెస్ట్

మండపేట: స్థానికంగా ఫొటోగ్రాఫర్ హత్య కేసులో మరో నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి మండపేట బైపాస్ రోడ్డులోని లేఅవుట్‌లో స్థానిక తర్వాణీపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ కుంజాల సురేష్ (26) హత్యకు గురైన విషయం విదితమే. సురేష్‌ను హత్య చేసేందుకు టీడీపీ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ పట్టణానికి చెందిన కోరా గోవిందు, బుంగ సంజయ్‌ల ద్వారా కారు డ్రైవర్ శెట్టి వీర వెంకటేశ్వరరావు, గునుపల్లి నాగసాయి కృష్ణప్రసాద్, మేనుగుల శ్రీనులతో రూ.రెండు లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటికే వెంకటేశ్వరరావు, సాయికృష్ణ ప్రసాద్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, సోమవారం మేనుగుల శ్రీనును కపిలేశ్వరపురంలో అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసులో మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.